సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 13 । జనవరి । 2023



– మరిన్ని చిత్రాలు IIలో..

సెలవుల వేళ.. ఇంటిబాట

- సంక్రాంతికి సొంతూరికి పయనమైన విద్యార్థులు

సంక్రాంతి సెలవులొచ్చాయంటే విద్యార్థుల్లో కనిపించే ఆనందమే వేరు.. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో హాస్టళ్లలో ఉండే విద్యార్థులంతా ఇంటిబాట పట్టారు. తమకోసం వచ్చిన కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్లకు పయనమయ్యారు. ఈ సందర్భంగా నగర బస్టాండ్ కిక్కిరిసిపోయింది. కొందరు ఆటోలు, బైక్‌లపై తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్

న్యూస్‌రీల్

ప్లాస్టిక్ కవర్ల పట్టివేత

- వ్యాపారులకు జరిమానాలు



నిజామాబాద్ సిటీ : నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న పలువురి వ్యాపారులపై మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ కొరడా ఝళిపించారు. గురువారం వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్‌లో ఉన్న కూరగాయలు, టిఫిన్ సెంటర్లపై దాడులు నిర్వహించారు. హనుమాన్ జంక్షన్‌లో ఓ టిఫిన్ సెంటర్‌పై దాడిచేయగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లు లభ్యమయ్యాయి. దాంతో ఆ వ్యాపారికి రూ. 3 వేలు జరిమానా విధించారు. మరోసారి ప్లాస్టిక్ కవర్లు లభ్యమైతే టిఫిన్ సెంటర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే పలువురు కూరగాయల వ్యాపారులపై రూ. 500 చొప్పున జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో జవాన్లు ప్రసాద్, చంద్రశేఖర్, రవి ఉన్నారు.

యూరియా కొరత లేదు



కోటగిరి : జిల్లాలో యూరియాకు కొరత లేదని, రైతులు బయట పుకార్లు నమ్మి అదనంగా కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవద్దని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ తిరుమల ప్రసాద్ సూచించారు. గురువారం కోటగిరి మండలంలోని అమ్రాపూర్‌లో భాస్కర్ సాగు చేస్తున్న ఆయిల్ పామ్ మొక్కల పెంపకాన్ని మండలంలోని ఆసక్తి ఉన్న రైతులకు చూపించారు. జిల్లాలో 55 వేల ఎకరాల్లో ఈ వాణిజ్య పంట సాగును విస్తరించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. రూ. 200 ధర ఉన్న ఆ యిల్ పాం మొక్కను రూ. 13కే అందజేస్తోందని, ఎకరాకు 50 మొక్కలు నాటొచ్చని, ఇందులో నాలుగేళ్ల వరకు అంతర పంటగా ఇతర మెట్ట పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ. 4,200 ఇస్తుందని, డ్రిప్ ఇరిగేషన్ సిస్టంను ఎస్సీలకు పూర్తి సబ్సిడీపై, బీసీలకు 90 శాతం సబ్సిడీపై అందిస్తోందన్నారు. జేడీఏ వెంట ఎత్తొండ విండో చైర్మన్ అశోక్ పటేల్, ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హమీద్, రైతు సమితి మండల అధ్యక్షుడు కొల్లూర్ కిశోర్ తదితరులున్నారు.

మడిగె కోసం దాదాగిరి

ఖలీల్‌వాడి : నగరంలో బీఆర్‌ఎస్ మాజీ నగర అధ్యక్షులు బెదిరింపు వాయిస్ మెసేజ్ కలకలం రేపింది. మడిగె ఖాళీ చేయకుంటే దుస్తులు విప్పి కొడతానిని బెదిరిస్తూ మాట్లాడిన వాయిస్ మెసేజ్‌లో సోషల్ మీడియాలో గురువారం చక్కర్లు కొట్టింది. దీనికి సంబంధించి బాధితుడు బంటు రాము గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. నగరంలోని సరస్వతినగర్‌లో ఓ ప్రముఖ వైద్యుడికి చెందిన భవనానికి సంబంధించి వివాదం కొన్నేళ్లుగా సాగుతోందని, దానిపై కేసులు, కోర్టులో వివాదాలు నెలకొన్నాయన్నారు. అయితే ఆ భవనంలో ఉన్న మడిగెను ఖాళీ చేయాలని మడిగె ఓనర్ అయిన తనను ఈ నెల 10న బీఆర్‌ఎస్ నగర మాజీ అధ్యక్షుడు న్యాలం కిషన్ ఫోన్‌లో బెదిరించారన్నారు. వారం రోజుల్లో మడిగె ఖాళీ చేయకపోతే దుస్తులిప్పి కొడతానని, ఎవరికైనా ఫిర్యాదు చేస్తే వారిముందే దాడి చేస్తానని బెదిరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయమపై సీపీ ఆఫీస్‌లో ఫిర్యాదు చేశానని, తనకు, తన కుటుంబసభ్యులకు న్యాలం కిషన్, మడిగెకు సంబంధించిన వారితో ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నానన్నారు. ఒకటో టౌన్ పీఎస్‌లోనూ ఫిర్యాద చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ టోర్నీకి గురుకుల విద్యార్థినులు



డిచ్‌పల్లి: ఖమ్మం జిల్లా బోనకల్లులో ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగే 67వ రాష్ట్ర జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సంగీత గురువారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు సన్నిధి నేహశ్రీ, ప్రవీణ, స్ఫూర్తిలను ప్రిన్సిపాల్ సంగీత, ఫిజికల్ డైరక్టర్ నీరజారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కిషన్, పీఈటీ జోత్స్న, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

పంచాయతీ పనుల హైజాక్..

ఉపాధిహామీ పథకం కింద మంజూరైన క్రీడా ప్రాంగణాల నిర్మాణ పనులను గ్రామ పంచాయతీలు చేపట్టాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా డీఆర్‌డీవో ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. పనులు పూర్తయిన తర్వాత నాణ్యత పరిశీలన అనంతరం బిల్లుల చెల్లింపులు ఉంటాయి. ఇక్కడ మాత్రం ఏజెన్సీకి ఇప్పటికే రూ.40 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించారు. ఈజీఎస్ ద్వారా వచ్చే బిల్లులను ఆయా పంచాయితీల నుంచి తెప్పించుకునేందుకు రంగం సిద్ధం చేస్తుండడం విశేషం.

- క్రీడాప్రాంగణాల నిర్మాణ పనులను చేపట్టిన డీఆర్‌డీవో
- ప్రైవేటు ఏజెన్సీ ద్వారా క్రీడా సామగ్రి పంపిణీ
- ఏకంగా రూ.40 లక్షల అడ్వాన్స్ చెల్లింపు
- నాణ్యత లేని మెటీరియల్ సరఫరా చేస్తున్న సంస్థ



జక్రాన్‌పల్లి మండలం చింతలూరుకు పంపిన పరికరాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : గ్రామ పంచాయతీల నిధుల మళ్లింపు నేపథ్యంలో ఇప్పటికే సర్పంచ్‌లు అనేక రకాలుగా అవస్థలు పడుతున్నారు. కాగా ఉపాధిహామీ పథకం కింద ఇటీవల మంజూరైన క్రీడా ప్రాంగణాల విషయంలోనూ పంచాయతీలు తమ అవసరం మేరకు పనులు చేసుకునే అవకాశం లేకుండా డీఆర్‌డీవో (జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ) హైజాక్ చేస్తోంది. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీలకు, వాటిలోని మరో 130 హ్యాబిటేషన్లు కలిపితే మొత్తం 660 ఉండగా 568 చోట్ల తెలంగాణ క్రీడా ప్రాంగణాల (టీకేపీ) నిర్మాణం కోసం భూమిని గుర్తించారు. వీటిలో 565కు అంచనాలు తయారు చేశారు. ఇప్పటికే 277 చోట్ల క్రీడా ప్రాంగణాల పనులు చేశారు. మిగిలిన వాటికి సంబంధించి అవసరమైన క్రీడా సామగ్రి ఆయా చోట్లకు పంపుతున్నారు. అయితే ఉపాధి హామీ పథకం కింద ఆయా గ్రామ పంచాయతీలే ఈ క్రీడా ప్రాంగణాల పనులు చేయించాల్సి ఉంది. తరువాత ఈజీఎస్ ద్వారా బిల్లులు వస్తాయి. క్రీడా ప్రాంగణాల్లో ఆర్చ్, వాలీబాల్ పోల్స్, డబుల్ బార్ ఎక్సర్‌సైజ్ పోల్స్, సింగిల్ బార్ ఎక్సర్‌సైజ్ పోల్స్, ఖోఖో పోల్స్, నేమ్ బోర్డ్ ప్లేట్లు, సపోర్టింగ్ పోల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటిని ఎంత పొడవు, ఎన్ని అంగుళాలు, మిల్లీమీటర్ల మందం, ఎన్ని కిలోల బరువు, ఎంత డయాస్ ఉండాలనే విషయమై స్పష్టమైన నిర్దిష్టత ఉంది. ఈ కొలతల మేరకు నిర్మించిన వాటికి, అది కూడా తగిన నాణ్యత ఉంటేనే బిల్లులు మంజూరు అవుతాయి. తరువాత వీటికి సంబంధించి ఉపాధి హామీ సామాజిక తనిఖీ సైతం ఉంటుంది. సామాజిక తనిఖీలో అవకతవకలు బయటపడితే మాత్రం పంచాయతీ బాధ్యులతో పాటు స్థానిక ఉపాధి హామీ సిబ్బంది సైతం దోషులుగా నిలిచే పరిస్థితి. ఇలాంటి నేపథ్యంలో డీఆర్‌డీవో ఏకపక్షంగా పెత్తనం తీసుకుని పంచాయతీల పనులను హైజాక్ చేసి పంగనామాలు పెడుతుండడం పట్ల పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా మంజూరైన క్రీడా ప్రాంగణాల పట్టిక..

మండలాలు/ పంచాయతీ	గ్రామాలు	భూమి గుర్తించినవి	పూర్తయిన ప్రాంగణాలు
ఆర్మూర్	18	18	2
బాల్కొండ	10	9	2
భీమ్‌గల్	31	30	19
బోధన్	46	35	31
చందూరు	6	5	3
ధర్పల్లి	24	23	1
డిచ్‌పల్లి	39	39	18
ఇందల్వాయి	27	20	4
జక్రాన్‌పల్లి	29	23	13
కమ్మర్‌పల్లి	15	12	4
కోటగిరి	46	35	26
మాక్లూర్	42	40	19
మెండోరా	11	11	1
మోర్తాడ్	10	10	1
మోస్రా	6	5	-
మోపాల్	38	33	26
ముప్కాల్	7	7	4
నందిపేట	39	39	15
నవీపేట	50	36	27
నిజామాబాద్	22	19	4
రెంజల్	17	16	8
రుద్రూరు	12	11	6
సిరికొండ	34	34	14
వర్ని	35	18	12
వేల్పూర్	19	19	9
ఎడపల్లి	19	13	2
ఏర్గట్ల	8	8	6
మొత్తం	660	568	277



సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌కు ఏజెన్సీ ద్వారా వచ్చిన పరికరాలు



సిరికొండ మండలం కొండూరుకు పంపిన క్రీడా పరికరాలు

ప్రైవేటు ఏజెన్సీ మతలబేందో..

ఈజీఎస్ ద్వారా చేయించాల్సిన పనులను గ్రామ పంచాయతీలు స్వేచ్ఛగా చేసుకునే అవకాశం లేకుండా డీఆర్‌డీవో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. క్రీడా ప్రాంగణాలకు సంబంధించిన సామగ్రిని ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా సరఫరా చేయిస్తుండడం విశేషం. విచిత్రమేమిటంటే డీఆర్‌డీవోకు సన్నిహితమైన సదరు ఏజెన్సీకి ఇప్పటికే రూ.40 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించారు. నిబంధనల ప్రకారం అసలు అడ్వాన్స్ ఇచ్చే అధికారం ఎవరికీ లేదు. పనులు పూర్తి చేసిన తరువాత నాణ్యత పరిశీలించిన తరువాతనే బిల్లుల చెల్లింపులు ఉంటాయి. ఆయా పనులకు సంబంధించి వాడిన మెటీరియల్ బట్టి బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. అలాంటి నేపథ్యంలో అడ్వాన్స్ ఇవ్వడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. అడ్వాన్స్ చెల్లింపులు చేయడంతో సంబంధిత మెటీరియల్‌కు ఎంత మేరకు బిల్లులు చేస్తారో తెలియని పరిస్థితి. ఇదిలా ఉండగా, ఇక్కడ మరో విస్తుగొలిపే అంశం వెలుగుచూసింది. 2018కి ముందు పంచాయతీల్లో వ్యక్తిగత మరుగుదొడ్లకు సంబంధించి మిగిలిపోయిన ఫండ్‌ను ప్రభుత్వానికి వెనక్కు పంపాల్సి ఉన్నప్పటికీ పంపకుండా, ఆ నిధులను డీఆర్‌డీవో తెప్పించుకుని సదరు ప్రైవేటు ఏజెన్సీకి అడ్వాన్స్ రూపంలో చెల్లింపులు చేయడం గమనార్హం. ఇక గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల పనులు పూర్తయిన తరువాత ఈజీఎస్ ద్వారా వచ్చే బిల్లులను సైతం ఆయా పంచాయితీల నుంచి తెప్పించుకునేందుకు రంగం సిద్ధం చేస్తుండడం విశేషం. ఈ విషయమై వివరణ కోరేందుకు డీఆర్‌డీవో చందర్‌నాయక్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు.

కంటి వెలుగును ఘనంగా ప్రారంభిస్తాం

- ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం



సుభాష్‌నగర్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు–2 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 18న మధ్యాన్నం 1.00 గంటకు నిర్దేశించిన ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కోరుతూ, జిల్లా, మండల, గ్రామ స్థాయిలలోని ప్రజాప్రతినిధులందరికి ఆహ్వాన లేఖలు అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ కంటి వెలుగు ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులకు సెల్ కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం ప్రారంభమయ్యేలా విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. కంటి వెలుగు శిబిరాల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన 70 బృందాల్లోని సభ్యులలో ఏ ఒక్కరు కూడా విధులకు గైర్హాజరు కాకుండా గట్టి పర్యవేక్షణ చేయాలన్నారు. 17వ తేదీ సాయంత్రం లోపే వైద్య బృందాలు తమకు కేటాయించిన ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. అవసరమైన సామగ్రి చేరిందా లేదా సరిచేసుకోవాలని అన్నారు. ఏర్పాట్లలో లోపాలు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెల్ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, డీఎంహెచ్‌ఓ సుదర్శనం, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్, డీపీవో జయసుధ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ల మెడపై మాస్టర్ ప్లాన్ కత్తి!



లింగాపూర్‌లో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తున్న మాస్టర్ ప్లాన్ బాధిత రైతులు

- ముసాయిదా రద్దు కోసం రాజీనామాలకు డిమాండ్
- విలీన గ్రామాల ప్రజాప్రతినిధులపై పెరుగుతున్న ఒత్తిడి
- పండుగ తర్వాత ఉద్యమం తీవ్రతరం చేస్తామంటున్న రైతులు

సాక్షి, కామారెడ్డి : మాస్టర్‌ప్లాన్ ముసాయిదాలో రెండు పంటలు పండే భూముల్లో ఇండస్ట్రియల్, గ్రీన్ జోన్లతో పాటు వంద ఫీట్ల రోడ్లను ప్రతిపాదించడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. మున్సిపల్ పాలకవర్గంతోపాటు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్నారు. దీంతో మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా నలభై రోజులుగా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. అన్నదాతల ఉద్యమానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. రైతులు చేస్తున్న ఉద్యమంలో ఆయా పార్టీల నేతలు పాల్గొని సంఘీభావం తెలుపుతున్నారు. అయితే ధర్నాలు, దీక్షలతో బల్దియా పాలకవర్గంలో ఎలాంటి స్పందన లేకపోవడం, భూమి విలువ పడిపోయిందని ఆవేదన చెంది ఓ రైతు ఆత్మహత్య చేసుకోవడంతో రైతుల్లో ఆగ్రహం పెరిగింది. వారం క్రితం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌ను ముట్టడించారు. ముసాయిదా రద్దు కోసం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఓ రోజు కామారెడ్డి నియోజకవర్గ బంద్ కూడా నిర్వహించారు. ముసాయిదా రద్దు కోసం కౌన్సిల్ తీర్మానం చేయాలని కోరుతూ పట్టణంలోని 49 మంది కౌన్సిలర్ల ఇళ్లకు వెళ్లి, వినతిపత్రాలు అందించారు. దీనిపై స్పందించిన బీజేపీ కౌన్సిలర్లు సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.



రాజీనామా చేయాలని తొమ్మిది మంది కౌన్సిలర్ల ఫొటోలతో రైతు జేఏసీ విడుదల చేసిన పోస్టర్

భవిష్యత్ కార్యాచరణపై చర్చ..

మాస్టర్ ప్లాన్ ముసాయిదాపై అభ్యంతరాలు తెలుపుతూ 2,374 దరఖాస్తులు వచ్చాయి. అయితే మాస్టర్ ప్లాన్‌తో నష్టపోతున్న విలీన గ్రామాలకు చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు రాజీనామా చేయాలని అల్టిమేటం జారీ చేశారు. దీనికి ఈనెల 20వ తేదీని డెడ్‌లైన్‌గా విధించారు. పార్టీలకతీతంగా మళ్లీ గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. కాగా బీజేపీకి చెందిన ఇద్దరు విలీన గ్రామాల కౌన్సిలర్లు తమ పదవులకు రాజీనామా చేయడానికి ముందుకు వచ్చారు. దీంతో మిగతా ఏడుగురు కౌన్సిలర్లపై ఒత్తిడి పెరుగుతోంది.

ముగ్గులతో నిరసనకు పిలుపు..

సంక్రాంతి పండుగ రోజున పట్టణంలోని ప్రధాన రహదారులపై ముగ్గులు వేసి నిరసన తెలపాలని సమావేశంలో నిర్ణయించారు. మాస్టర్‌ప్లాన్‌తో నష్టపోయే గ్రామాలకు చెందిన రైతులంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ముగ్గులు వేసి నిరసన తెలపాలని తీర్మానించారు. 17వ తేదీన పాతరాజంపేటలో మరోసారి సమావేశం కానున్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

నిజామాబాద్ అర్బన్ : కోటగిరిలో పాఠశాల టీచర్ మల్లికార్జున్‌పై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం నగరంలో జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వివిధ వామపక్ష రాజకీయ పార్టీల నాయకులు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు మానవహక్కుల నాయకులు జేఏసీగా ఏర్పడి నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తా వద్ద మానవహారం నిర్మించారు. అనంతరం పోలీస్ కమిషనర్, డీఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. కోటగిరిలో మల్లికార్జున్ అనే ఉపాధ్యాయుడిపైన జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. అతనిపై దాడి చేసిన వారిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు పట్టించుకోకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. అంతేగాక బాధితులైన మల్లికార్జున్ పైనే తిరిగి కేసు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని జేఏసీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే రాష్ట్రస్థాయి నుంచి జేఏసీ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ రమేశ్, స్టీరింగ్ కమిటీ మెంబర్లు కోల జనార్దన్, ఝాన్సీ, గుత్తా జ్యోత్స్న, వహీద్, హనుమంతరావు, సైకిలాబ్, కోట రమేశ్, విజయ్, ఆదంరాజ్, స్పార్టకస్, డా.తిరుపతయ్య, గొర్రెపాటి మాధవరావు జిల్లాకు వచ్చి నిరసనలో పాల్గొన్నారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు. ఈ నిరసనలో జిల్లాలోని వివిధ సంఘాలకు చెందిన నాయకులు ఆకుల పాపయ్య, రమేశ్ బాబు, సరిత, రామారావు, గోవర్ధన్, జన విజ్ఞాన వేదిక నాయకులు రమేశ్, నర్రా రామారావు, నర్సింలు, వివిధ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు, దళిత బహుజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

కోటగిరి ఘటనపై విచారణ

నిజామాబాద్ అర్బన్ : కోటగిరి ప్రభుత్వ పాఠశాల టీచర్ మల్లికార్జున్ వ్యవహారంపై ఆరు రోజులుగా రహస్య విచారణ కొనసాగుతుంది. ఉన్నతాధికారి ఆదేశాల మేరకు విద్యాశాఖలోని ఓ సీనియర్ అధికారి విచారణ చేస్తున్నారు. ముఖ్యంగా మల్లికార్జున్‌ని గుడిలోకి తీసుకెళ్లి క్షేమాపణ చెప్పించడం, రెండు గంటలపాటు జరిగిన ఘటనలో ఎంఈవో, హెచ్‌ఎంలు పట్టించుకోకుండా ఉండిపోవడంపై అధికారులు ఆరా తీస్తున్నారు. కొన్ని నెలల కిందటనే మల్లికార్జున్ వ్యవహారాన్ని సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు కొందరు ఏబీవీపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులకు తెలియజేశారని ముందస్తుగా ఈ ఘటన జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై అధికారులు విచారణ చేస్తున్నారు. కాగా హెచ్‌ఎం, ఎంఈవోలపై రాష్ట్ర విద్యాశాఖ అధికారులు కూడా సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. త్వరితగతిన విచారణ చేపట్టి సంబంధిత వారిపై శాఖపరమైన చర్యలు తీసుకొని ఈ వ్యవహారాన్ని ముగించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దీంతో పాఠశాలకు చెందిన ఇద్దరు టీచర్లతో పాటు మరో అధికారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పండ్ల మొక్కలకు ప్రాధాన్యత



బాల్కొండ: హరితహారంలో మొక్కల పెంపకం కోసం ఇప్పటి నుంచే గ్రామాల్లో జీపీల ఆధ్వర్యంలో నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం బ్యాగ్ ఫిల్లింగ్ ప్రక్రియను పూర్తి చేసి , విత్తనాలను విత్తుతున్నారు. నర్సరీల్లో నీడ నిచ్చే మొక్కలను పెంచకుండా , పండ్లను ఇచ్చే మొక్కలతో పాటు ఇతర ఉపయోగ కరమైన మొక్కలను పెంచాలని ఉన్నత అధికారులు స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు. ప్రతి జీపీకి 12 వేల మొక్కలను పెంచాలని లక్ష్యం విధించారు.

పెంచాల్సిన మొక్కలివే..

ప్రస్తుతం సిద్ధం చేస్తున్న నర్సరీల్లో 33 రకాల మొక్కలను పెంచాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. అల్లనేరేడు, అశ్వగంధ, వెదురు, మారేడు, చింత, దానిమ్మా, ఈత, గంగనేరుడు, ఎర్రచందనం, గనేరు, గోరింటాకు, ఇప్ప, జామ, కానుగ, కర్జూరం, ఉసిరి, లేమన్ గ్రాస్, కలబంధ, వేప, టేకు, మామిడి, సపోట, కరివేపాకు తదితర మొక్కలు పెంచాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 530 నర్సరీల్లో ప్రస్తుత సంవత్సరం 63.60 లక్షల మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు.

వేగంగా సాగుతున్నాయి..

ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం పండ్ల మొక్కలతో పాటు, అధికారులు సూచించిన మొక్కల విత్తనాలనే విత్తుతున్నాం. అవే మొక్కలను పెంచాలని గ్రామీణా అభివృద్ధి సంస్థ నిర్ణయించింది. మొక్కల పెంపకం పనులు వేగంగా సాగుతున్నాయి.

– ఇందిర, ఏపీవో, బాల్కొండ

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురి డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ముగ్గురు విద్యార్థులు డిబార్ అయినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. గురువారం ఉదయం జరిగిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 2,844 మంది విద్యార్థులకు 2,719 మంది పరీక్ష రాశారని తెలిపారు. నిజామాబాద్‌లోని గౌతమి డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు, బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఒకరు డిబార్ అయినట్లు చెప్పారు. అలాగే మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మూడో సెమిస్టరు రెగ్యులర్ పరీక్షల్లో 8,553 మంది విద్యార్థులకు 7851 మంది హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని నిశిత డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు కంట్రోలర్ తెలిపారు.

నగరంలో దేశీదారు విక్రయాలు!

ఖలీల్‌వాడి: మహారాష్ట్రలో తయారువుతున్న దేశీదారును జిల్లాకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. తక్కువ ధరలో ఎక్కువ మత్తు ఉండటంతో రోజు రోజుకు దేశీదారు తాగే వారి సంఖ్య పెరుగుతోంది. నగరంలోని ఖిల్లా చౌరస్తా, వర్నిరోడ్డు, చంద్రశేఖర్‌కాలనీ, నాగారం, మాలపల్లి, నాందేవ్‌వాడ, అర్సపల్లి, ఖానాపూర్‌లో వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కిరణాషాపులు, ఇళ్లలో ఉంచి అమ్మకాలు చేస్తున్నారు. జిల్లాలో ఎక్సైజ్‌శాఖ తోపాటు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నప్పటికి వీటి అమ్మకాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. మహారాష్ట్రలోని ఉమ్రితోపాటు ధర్మాబాద్, నాందేడ్ నుంచి ద్విచక్రవాహనాలు, బస్సులు, రైళ్లలో తీసుకొచ్చి దేశీదారును అమ్ముతున్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు చేపట్టకపోవడంతో దేశీదారు మద్యాన్ని విచ్చలవిడిగా తరలిస్తున్నారు. మహారాష్ట్ర, బీహార్, యూపీతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు దేశీదారుకు బానిసలుగా మారుతున్నారు.

అవసరం మేరకు ఎరువులను అందించాలి



బోధన్‌రూరల్: యాసంగిలో రైతులకు అవసరం మేరకు ఎరువులు అందేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. గురువారం బోధన్ మండలంలోని సాలూర గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో రైతు వేదిక, సొసైటీ, ఎరువుల గోదాంలను పరిశీలించారు. అనంతరం ఏఈవోలతో సమావేశం నిర్వహించి పంటల వివరాల నమోదు, రైతు బంధు, రైతు బీమా వంటి అంశాలపై సమీక్షించారు. ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పంటల సాగు వివరాలను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇంచార్జి ఏడీఏ సిద్దిరాములు, ఏఈవోలు పాల్గొన్నారు.

కంటివెలుగును విజయవంతం చేయాలి



డిచ్‌పల్లి: కంటి వెలుగు –2 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ సూచించారు. గురువారం డిచ్‌పల్లి సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ)లో వైద్య ఆరోగ్య కార్యకర్తలు, ఆశకార్యకర్తలకు కంటివెలుగు కార్యక్రమంపై శిక్షణనిచ్చారు. ఈ నెల 18 నుంచి కంటివెలుగు ప్రారంభమవుతుందన్నారు. ఆయా గ్రామాల్లో పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఏర్గట్ల ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నిజామాబాద్‌అర్బన్: ఏర్గట్ల ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రాజేందర్‌ను సస్పెన్షన్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని కొన్ని రోజుల క్రితం విద్యార్థులు లేఖ రాశారు. దీంతో విద్యా కమిటీ చైర్మన్ విద్యాశాఖ అధికారులతో కలిసి పాఠశాలలో విచారణ చేశారు. విద్యార్థినులను వేధించింది వాస్తవేమనని పలువురు విద్యార్థులు విచారణలో తెలిపారు. దీంతో ఎంఈఓ నివేదికను జిల్లా విద్యాశాఖకు పంపగా డీఈవో రాజేందర్‌ను సస్పెండ్ చేశారు.

వర్షానికి ధాన్యం తడవకుండా..

- టార్పాలిన్ రూపొందించిన విద్యార్థిని
- తక్కువ సమయంలో వడ్లు కుప్ప చేసేలా ఏర్పాట్లు
- రైతులకు తప్పనున్న ఇబ్బందులు
- జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్ట్

రామారెడ్డి: ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఆరబోసిన సమయంలో వర్షం పడితే అన్నదాతల కష్టం నీటి పాలవుతుంది. ధాన్యం విక్రయించడానికి కేంద్రాలకు తీసుకొచ్చిన తర్వాత వానలు పడి ఎంతో మంది రైతులు నష్టపోతుంటారు. ఇలాంటి సమయంలో ధాన్యంకాపాడుకోడానికి కర్షకులు అనేక తిప్పలు పడుతారు. రైతుల ఇబ్బందులు చూసిన ఓ విద్యార్థి వారి కోసం ధాన్యం తడవకుండా ఉండేలా ఒక పరికరం తయారు చేసింది. రామారెడ్డి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న తేజస్విని రైతుల కోసం



ప్రాజెక్టు గురించి వివరిస్తున్న తేజస్విని

టార్పాలిన్‌ను రూపొందించింది. ఎస్‌వో వనిత, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఈ ప్రాజెక్టును తయారు చేసింది. నిర్మల్‌లో ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో తేజస్విని తన ప్రాజెక్టును ప్రదర్శించింది. దీనిని అధికారులు జాతీయ స్థాయికి ఎంపిక చేశారు.

ఇలా పని చేస్తుంది..

రైతులు ధాన్యాన్ని టార్పాలిన్లలో ఆరబోస్తారు. ఒక్కో దానిలో 10 నుంచి 20 క్వింటాళ్ల వరకు ఆరబోస్తారు. వర్షం వస్తే ధాన్యం ఒక్క దగ్గరి చేసి వడ్ల మీద నీళ్ల పడకుండా ఎదైనా రక్షణ ఏర్పాటు చేయడానికి చాలా సమయం పడుతుంది. ఈ లోగా ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవుతుంది. తక్కువ సమయంలో వడ్లను ఒక్క దగ్గరకు తెచ్చి మీద నీళ్ల పడకుండా ఎలా రక్షించుకోవాలో తేజస్విని చేసి చూపింది. టార్పాలిన్‌కు రంధ్రాలు చేసి నైలాన్ తాడును ఏర్పాటు చేసింది. సంచికి చేసిన రంధ్రం ద్వారా వడ్లకు నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకొంది. నైలాన్ తాడు రెండు చివరలను లాగితే ఆరబోసిన ధాన్యం కుప్పగా మారుతోంది. సంచి కింద పిరమిడ్ ఆకారంలో సన్నని రేకును అమర్చించింది. తాడు చివరలను లాగితే తాటిపత్రి పిరమిడ్ ఆకారంలోకి వస్తుంది. దీంతో ధాన్యం తడవకుండా తక్కువ సమయంలో పని పూర్తి అవుతుంది. ఈ పనిని ఒక వ్యక్తి చేయొచ్చు. పెద్ద టార్పాలిన్‌లో 20, 30 క్వింటాళ్ల ధాన్యం ఆరబోస్తే తాడును సైకిలుకు కట్టి కుప్ప చేయొచ్చని ఆమె పేర్కొంది.

గంజాయిపై గట్టి నిఘా

- ప్రత్యేక బృందాలతో విక్రేతల గుర్తింపు
- ఒకేరోజు ఎనిమిది మంది అరెస్టు

మోర్తాడ్: గంజాయి విక్రయాలకు అడ్డుకట్ట వేయడానికి పోలీసు యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేసింది. ప్రతి సర్కిల్ పరిధిలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గ్రామాల్లో గంజాయి విక్రయదారులు, మత్తుకు బానిసలైన వారిని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నం అయ్యారు. జిల్లాలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతుండటం, అనేక మంది యువత మత్తుకు అలవాటుపడి జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటుండటంతో ప్రజల నుంచి నిరసన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు స్పందించి గంజాయిని నిరోధించడానికి పోలీసులతో సమీక్ష నిర్వహించారు. గతంలో గంజాయి విక్రయాలపై చూసి చూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొగా ఇక నుంచి ఎట్టి పరిస్థితుల్లో గంజాయి గ్రామాల్లో కనిపించకూడదని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ప్రత్యేకంగా బాల్కొండ నియోజకవర్గంలో గంజాయిపై పోలీసులు నిఘా ఏర్పాటు చేయడంతో గంజాయి విక్రయిస్తున్న పలువురిని గుర్తించారు. మోర్తాడ్ మండలంలో వడ్యాట్‌కు చెందిన ఇద్దరిని, కమ్మర్‌పల్లి మండలంలో కోనసముందర్, కమ్మర్‌పల్లిలకు చెందిన ఐదుగురిని అరెస్టు చేశారు. బాల్కొండ కళాశాల సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని పట్టుకుని సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఇదే ఘటనలో మరో యువకుడు పరారయ్యాడు. గంజాయి విక్రయించేవారినే కాకుండా బానిసలైన వారిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతుండటం గమనార్హం.

రాజమండ్రి సెంట్రల్ జైలులో ఇక్కడివారు

గంజాయి విక్రయాలతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బును స్వాధీనం చేసుకోవచ్చని కొందరు యువకులు అక్రమ వ్యాపారానికి అలవాటు పడ్డారు. చివరకు ఆంధ్రప్రదేశ్ పోలీసులకు పట్టుబడి రాజమండ్రి కేంద్ర కారాగారంలో అండర్ ట్రయల్ ఖైదీలుగా ఏర్గట్ల మండలానికి చెందిన ఇద్దరు, హైదరాబాద్‌కు చెందిన ఒక యువకుడు ఉన్నారు. నాలుగు నెలల కింద నిర్మల్‌కు చెందిన ఒక కారును అద్దెకు తీసుకుని ఒరిస్సా నుంచి గంజాయి కొనుగోలు చేసేందుకు వీరు ముగ్గురు వెళ్లారు. ఒరిస్సా నుంచి గంజాయి తీసుకుని వస్తుండగా ఏపీ పోలీసుల తనిఖీల్లో పట్టుబడి జైలు పాలయ్యారు. ఇది ఇలా ఉండగా వడ్యాట్‌కు చెందిన ఒక యువకుడు కొన్నేళ్ల నుంచి గంజాయి విక్రయాల్లో ఆరితేరాడు. ఇక్కడ పోలీసుల నిఘా పెరగడంతో హైదరాబాద్‌కు మకాం మార్చి అక్కడి నుంచి ఈ ప్రాంతానికి గంజాయిని సరఫరా చేస్తున్నాడని తెలుస్తుంది. ఈ తరుణంలోనే వడ్యాట్‌లో ఇద్దరిని గంజాయితో సహా పోలీసులు పట్టుకున్నారని వెల్లడైంది.



మోర్తాడ్ పోలీసులు అరెస్టు చేసిన గంజాయి కేసులో నిందితులు

ముందు నుంచి నిఘా లేకపోవడంతో..

అనేక గ్రామాల్లో యువత గంజాయి మత్తుకు బానిసయ్యారు. ముందు నుంచి గంజాయి విక్రయాలపై నిఘా లేకపోవడంతో ఈ వ్యాపారం విస్తరించిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గంజాయి మత్తులో రెండు హత్యలు, ఘోర రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు మృత్యువాత పడ్డారు. ఆ సమయంలోనే పోలీసులు స్పందించి ఉంటే గంజాయికి అడ్డుకట్ట పడేదనే వాదన బలంగా వినిపిస్తుంది.

నిజామాబాద్ రీజియన్‌కు రూ.5.40 కోట్ల కేటాయింపు

- బస్టాండ్‌ల ప్రహరీల నిర్మాణానికి నిధులు
- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



ఖలీల్‌వాడి: ఆర్టీసీ బస్టాండ్‌లకు కేటాయించిన భూమి కబ్జాకు గురవుతున్నందున వాటిని రక్షించడాని ప్రహరీ నిర్మాణానికి ఉమ్మడి నిజామాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లకు రూ.5.40 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో ఆయన వివరాలను వెల్లడించారు. జక్రాన్‌పల్లికి రూ.27 లక్షలు, కమ్మర్‌పల్లికి రూ.27.39 లక్షలు, మోర్తాడ్ రూ.27.70లక్షలు, ధర్పల్లికి రూ.24.89 లక్షలు, ఇందల్వాయికి రూ.24.93 లక్షలు, మాక్లూర్‌కు రూ.29.23లక్షలు, నందిపేట్‌కు రూ.48.64 లక్షలు, సిరికొండకు రూ.28.75 లక్షలు, రెంజల్‌కు రూ.18.67 లక్షలు, భిక్కనూర్‌కు రూ.35.65 లక్షలు, దోమకొండకు రూ.రూ.23.35 లక్షలు, గాంధారికి రూ.13.30 లక్షలు, లింగంపేటకు రూ.30.66 లక్షలు, బిచ్కుందకు రూ.35.65 లక్షలు, మద్నూర్‌కు రూ.27.99 లక్షలు, నిజాంసాగర్‌కు రూ.34.82 లక్షలు, పిట్లం రూ.38.14 లక్షలు, రుద్రూర్‌కు రూ.8.91 లక్షలు, వర్నికి రూ.26.02 లక్షలు, బోధన్‌కు రూ.17.05 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. వీటిని టెండర్ నిర్వహించి పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే బస్టాండ్‌లలో సీసీ రోడ్లకు నిర్మాణానికి రూ. 93.65 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కామారెడ్డికి రూ.20 లక్షలు, బోధన్‌కు రూ.33.30 లక్షలు, నిజామాబాద్‌కు రూ.9 లక్షలు, బాన్సువాడకు రూ.31.35 లక్షలు కేటాయించినట్లు చెప్పారు.

దేశాన్ని ప్రైవేటుపరం చేస్తున్నారు



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ: లక్షల కోట్లు అప్పు చేసి దేశాన్ని దివాళా తీయించడమే కాకుండా, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేసి ప్రైవేటు పరం చేస్తున్నారని ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీస్ స్టేషన్‌లో ఆయన గురువారం ప్రారంభించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. 88 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గ క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్‌మస్, నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడుతు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు దండుకుంటుందన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాన్‌సింగ్, వైస్ ఎంపీపీ రాజన్న, రాజేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్‌లు రాజారెడ్డి, రమేష్, శ్రీనివాస్, ఎంపీటీసీలు సతీష్, గోవర్ధన్, గంగారం, తహసీల్దార్ గఫర్‌మియా పాల్గొన్నారు.

సంక్రాంతికి.. సొంతూరికి..

విద్యా సంస్థలకు శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు కావడంతో విద్యార్థులు ఇంటి బాట పట్టారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు పండుగకు ఊరికి పయనమయ్యారు. దీంతో బస్టాండ్‌లో రద్దీ నెలకొంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



ఇంటికి వెళ్లడానికి పేర్లు రాయించుకుంటున్న ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు









యువతను ప్రోత్సహించడానికే కేసీఆర్ కప్ టోర్నీ



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా



విజేతగా నిలిచిన నిజామాబాద్ జట్టు

నిజామాబాద్‌నాగారం: యువతను ప్రోత్సహించడానికే జిల్లాలో పెద్ద ఎత్తున కేసీఆర్ కప్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించినట్లు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. మూడు రోజులుగా నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో జరుగుతున్న కేసీఆర్ సేవాదళ్ కబడ్డీ టోర్నీ ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు హుసాముద్దీన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, ఆర్టీఐ కమిషనర్ మహమ్మద్ ఉమేర్, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్, మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు రమణరావు, రెడ్‌కో మాజీ చైర్మన్ అలీం పాల్గొన్నారు.

డిచ్‌పల్లి డివిజన్ ఏర్పాటు

డిచ్‌పల్లి : నిజామాబాద్ విద్యుత్ శాఖ సర్కిల్ పరిధిలో కొత్తగా డిచ్‌పల్లి డివిజన్ మంజూరైంది. ఈ మేరకు వరంగల్ సీఎండీ గోపాల్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. పాత నిజామాబాద్ డివిజన్‌ను రెండుగా విభజించారు. ఇందులో కొత్తగా డిచ్‌పల్లి డివిజన్‌ను ఏర్పాటు చేశారు. డిచ్‌పల్లి డివిజన్ పరిధిలో రెండు సబ్‌డివిజన్లు, 12 ఆపరేషన్ సెక్షన్లు, ఒక ఈఆర్‌వో కార్యాలయాలను కేటాయించారు. డిచ్‌పల్లి డివిజన్ ప రిధిలో నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి సబ్ డి విజన్లు,ఒక ఈఆర్‌వో పని చేస్తాయి. నిజామాబాద్‌రూరల్, సారంగపూర్, మోపాల్, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ, గడ్కోల్, ఎల్లారెడ్డిపల్లి, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, బర్ధిపూర్ విద్యుత్ సెక్షన్‌లను డిచ్‌పల్లి డివిజన్‌లో కలిపారు. కొత్త డివిజన్‌కు డీఈ, ఏఈ, జేఏవో, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, సబ్ ఇంజినీర్, ఆఫీస్ సబార్డినేట్, వాచ్‌మెన్, స్వీపర్ పోస్టులను ప్రకటించారు.

సీఎస్‌తో నందిపేట మండలానికి అనుబంధం

నందిపేట్: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శాంతికుమారికి నందిపేట మండలంతో అనుబంధం ఉంది. గతంలో మండలంలోని నడ్కుడ గ్రామ శివారులోని గోదావరి పరివాహక ప్రాంతానికి ఆమె వచ్చారు. గోదావరి పరివాహక ప్రాంతంలో కృష్ణ జింకలు, వలస పక్షులు సంచరిస్తున్న సమాచారం మేరకు అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రెటరీ హోదాలో 2022 మేలో పర్యటించారు. అటవీశాఖ అధికారులతో మాట్లాడి పర్యాటక ప్రాంతం ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను తెలుసుకున్నారు.



నడ్కుడ శివారులో గోదావరి తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న శాంతికుమారి(ఫైల్)

ప్రైవేటు వాచ్‌మన్ దారుణ హత్య

బాన్సువాడ టౌన్ : బాన్సువాడ తహసీల్ కార్యాలయం వద్ద గురువారం తెల్లవారు జామున ప్రైవేటు వాచ్‌మన్ దారుణ హత్యకు గురయ్యాడు. హతుడు బాణామతి చేస్తాడని మూఢ నమ్మకం ఉన్నవారు ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారా ? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామానికి చెందిన ఎడ్డి పోచయ్య(50) బాన్సువాడ తహసీల్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. తెల్లవారు జామున 5 గంటలకు గ్రామం నుంచి పోచయ్య బైక్‌పై భవన నిర్మాణం వద్దకు వచ్చాడు. ఇదే సమయంలో తహసీల్ కార్యాలయంలో రాత్రి విధులు నిర్వహించే వీఆర్ఏ టీ తాగేందుకు సమీపంలోని తాడ్కోల్ చౌరస్తా వద్దకు వెళ్లాడు. టీ తాగి వచ్చిన ఆయన పోచయ్య హత్యకు గురైన విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. పోచయ్య తలను బండరాయికి వేసి కొట్టడంతో చనిపోయాడని పోలీసులు నిర్ధారించారు. మృతుడి మెడలో బంగారు గొలుసు, ఉంగరం అలాగే ఉన్నాయి. పోచయ్య గతంలో చేతబడి చేసేవాడని మూఢ నమ్మకం స్థానికుల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఎవరైనా హత్య చేశారా..? లేక పాత కక్షలు కారణమా కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి

క్రైం కార్నర్

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో మహ్మద్ సులేమాన్ అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచడంతో కేసు నమోదు చేసినట్లు నాలుగో టౌన్ ఠాణా ఎస్సై సందీప్ తెలిపారు. ఎల్లమ్మగుట్టలో సులేమాన్ పీడీఎస్ బియ్యం నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తనిఖీలు చేసి 18 సంచుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ బియ్యం తక్కువ రేటుకు నిజామాబాద్ పరిసర గ్రామాల్లో కొనుగోలు చేసి హోల్‌సేల్ మార్కెట్‌లో ఎక్కువ రేటుకు అమ్ముతున్నట్లు సులేమాన్ ఒప్పుకున్నారని, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



యాదగిరి (ఫైల్)

భిక్కనూరు: మెదక్ జిల్లా కాళ్లకల్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన చిన్నోళ్ల యాదగిరి (26) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మేడ్చల్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్న యాదగిరి ఓ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆయన గురువారం బైకు మీద వెళ్తుండగా కాళ్లకల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

పశువైద్యాధికారిపై వరకట్నం కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ముప్కాల్ మండలం కిసాన్‌నగర్‌కు చెందిన పశువైద్యాధికారి గౌతమ్‌పై ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ప్రస్తుతం గౌతమ్ మోర్తాడ్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో భార్యభర్తలకు పోలీసులు, మహిళ సంఘాలు, పెద్దలు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినప్పటికి భార్యను కట్నం కోసం వేధింపులకు గురిచేయడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. గౌతమ్‌కు 41 సీఆర్‌పీ కింద నోటీసులు అందించామని ఎస్సై తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్ రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి ఖదీర్ తీర్పునిచ్చారు. ఈ నెల 6న ధర్పల్లి పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సిరికొండ మండలంలోని తూంపల్లికి చెందిన భూక్యా మోజ్యా పట్టుబడ్డారు. భూక్య మోజ్యాను గురువారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

పశువుల కొట్టం దగ్ధం



మాచారెడ్డి: మండలంలోని కొత్తపల్లిలో గురువారం పశువుల కొట్టం దగ్ధమైంది. గ్రామానికి చెందిన గుండి లింగం పశువుల కొట్టానికి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలిపోయింది. గ్రామస్తులు మంటలను ఆర్పివేశారు.

రైలుకింద పడి మహిళ ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): తల్లితో గొడవపడి క్షణికావేశంలో ఓ మహిళ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల కేంద్రమైన చేగుంట రైల్వే గేటు సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపిన వివరాలు.. కామారెడ్డికి చెందిన పెండ్యాల భాగ్య(30)కు చిన్న కోడూరు మండలం రామంచకు చెందిన రాజుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. భాగ్యను భర్త వదిలి వెళ్లిపోగా తల్లి నర్సమ్మతో కలిసి చేగుంటలో ఉంటూ కూలీ పనులు చేస్తోంది. బుధవారం రాత్రి నరసమ్మ కూతురు భాగ్యతో గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన భాగ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించారు. భాగ్యకు కూతుర్లు అమృత, అర్చన, కుమారుడు ఆకాశ్ ఉన్నారు.

వాటర్ ట్యాంకు ఎక్కి ఒకరి హల్‌చల్

- ఆత్మహత్య చేసుకుంటున్నానని కేకలు
- కాపాడిన పోలీసులు
- మతిస్థిమితం లేకపోవడంతో పుట్టింటికి వెళ్లిన భార్య

చేగుంట(తూప్రాన్): వాటర్ ట్యాంకు ఎక్కి ఓ వ్యక్తి తన సమస్యను పరిష్కరించకుంటే కిందకు దూకుతానని హంగామా చేసిన ఘటన చేగుంటలోని బుడగ జంగాల కాలనీలో గురువారం చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి కొద్దికాలంగా విచిత్రంగా ప్రవర్తిస్తుండటంతో భార్య అపర్ణ పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో నిత్యం మద్యం తాగుతూ మతిస్థిమితం కోల్పోయినట్లు వ్యవహరిస్తున్నాడు. గురువారం చేగుంట బుడగజంగాల కాలనీ ట్యాంకుపైకి ఎక్కిన రవీందర్‌రెడ్డి తనను కొంతమంది చంపడానికి ప్రయత్నిస్తున్నారని, భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని దీంతో ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చానని కేకలు వేశాడు. తనను దింపడానికి వస్తే ట్యాంకుపై నుంచి దూకుతానని బెదిరించాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని, ట్యాంకు దిగితే సమస్య పరిష్కరిస్తామని నచ్చజెప్పారు. రవీందర్‌రెడ్డి గురించి తిమ్మాపూర్ గ్రామస్తులకు సమాచారం అందించారు. యోగా కోచ్ కరణం గణేష్ ట్యాంకు వద్దకు వచ్చి తిమ్మాపూర్ గ్రామస్తులు రవీందర్ బంధువులతో ఫోన్‌లో మాట్లాడించి ట్యాంకుపై నుంచి దింపారు. రవీందర్‌రెడ్డి డిప్రెషన్‌లో ఉన్నట్లు గుర్తించిన ఎస్సై ప్రకాశ్‌గౌడ్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు.